క్లుప్తంగా

రైతులు, కూలీలకు అనువుగా ఉపాధి పనులు

పీలేరు : రైతులు, కూలీలకు అనువుగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులు కల్పిస్తున్నట్లు ఏపీఓ మహేష్ తెలిపారు. గురువారం మండలంలోని రేగళ్లలో ఉపాధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డుకల్గిన ప్రతి కూలీ ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో కూలీలు వలసలు వెళ్లకుండా స్థానికంగా ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు చెప్పారు. రైతులకు అనువుగా ఫారంపాండ్లు, బౌండరీలు, కందకాలు పనులు జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది కూలీలు పాల్గొన్నారు.

గోప్యతకు భంగం కలిగించారని కేసు

బి.కొత్తకోట : గోప్యతకు భంగం కలిగించిన వ్యక్తిపై ఓ మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సూర్యనారాయణ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా.. మండలంలోని కోటావూరు పంచాయతీ చౌటకుంటపల్లెకు చెందిన జ్యోతితో దిన్నిమీదపల్లెకు చెందిన విశ్వనాథ్ సన్నిహితంగా ఉండేవారు. అప్పుడు తీసుకున్న ఫొటోలు తన వద్ద ఉన్నాయని వేధింపులకు గురిచేస్తున్నాడు. మొబైల్ ఫోన్‌లో తన ఫొటోలు పెట్టుకున్నాడని, దీనిపై చర్యలు తీసుకోవాలని చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న టీటీడీ అధికారులు, అర్చకులు

వాల్మీకిపురం : టీటీడీ ఆధ్వర్యంలోని వాల్మీకిపురం శ్రీ పట్టాభిరామాలయంలోని హుండీ ఆదాయాన్ని గురువారం టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో లెక్కించారు. ఐదు నెలలకు గానూ హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.3,41,180 వచ్చినట్లు ఏఈవో గోపీనాథ్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, నాగరాజ, అర్చకులు క్రిష్ణప్రసాద్ భట్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

పీలేరు రూరల్ : స్థానిక సదుం మార్గంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు అర్చకులు రాజుస్వామి తెలిపారు. శనివారం సాయంత్రం స్వామివారి పంచామృతాభిషేకం, ప్రత్యేకాలంకరణ, అర్చన, సర్వదర్శనం, తీర్థప్రసాద వినియోగం ఉంటాయన్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పుష్పపల్లకీలో ఊరేగించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

భగవద్గీత పఠనం అలవర్చుకోవాలి

కేవీపల్లె : ప్రతి ఒక్కరూ జ్ఞానం పొందడానికి భగవద్గీత పఠనం అలవర్చుకోవాలని త్రైత సిదాంతం, ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు అన్నారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీతలోని వివిధ శ్లోకాలు గూర్చి అవగాహన కల్పించారు. భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో త్రైత సిదాంతం, ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక వి.కోట, పీలేరు, మదనపల్లె, పొదలకూరు కమిటీల సభ్యులు కె. అశోక్‌బాబు, రామకృష్ణ, బాలం లక్ష్మీ నరసింహులు, నరసయ్య, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎనుములవారిపల్లె చెరువులో ఇసుకతవ్వకాలు

మదనపల్లె : మండలంలోని కొత్తవారిపల్లె-2 పంచాయతీకి చెందిన ఎనుములవారిపల్లె చెరువులో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. గురువారం ఉదయం 6 గంటలకు జేసీబీతో ఇసుకను త్రవ్వి పదులసంఖ్యలో ట్రాక్టర్లతో బయటకు తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. గ్రామస్తులు స్థానిక వీఆర్వో మునస్వామికి ఫోన్ చేసి చెపితే...తాను ఎలక్షన్ డ్యూటీలో భాగంగా జెడ్పీ హైస్కూల్‌లో ట్రైనింగ్‌లో ఉన్నానని, రేపు వచ్చి చూస్తానని సమాధానమిచ్చారు. దీంతో గ్రామస్తులు మీడియాకు సమాచారం అందించి, ఇప్పటికే ఇసుకాసురులు చెరువు మొత్తం గుంతలు తవ్వేశారని, దోపిడీని అరికట్టాల్సిందిగా కోరారు.

రుచికరమైన భోజనం అందించాలి

కలకడ : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర కోఆర్డినేటర్ నాగమ్మ, ఎంఈఓ రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఆదర్శ పాఠశాలలో మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన నిర్వాహకులుతో సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు. పాఠశాల మొదటి రోజు మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఎలాంటి ఫిర్యాదులు అందినా ఉపాధ్యాయులపై కూడా చర్యలు తప్పవన్నారు.

పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌పై శిక్షణ



పోస్టల్‌బ్యాలెట్ కౌంటింగ్‌పై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఆర్వో హరిప్రసాద్

మదనపల్లె : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని జెడ్పీహైస్కూల్‌లో గురువారం మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్ విశిష్టత, ఎలా లెక్కించాలి?, ఇన్‌వ్యాలిడ్ ఓట్లను ఏ విధంగా గుర్తించాలి? ఎన్నికల సంఘం పోస్టల్‌బ్యాలెట్లకు సంబంధించి నూతనంగా వెలువరించిన నిబంధనలకు అనుగుణంగా ఎలా నడుచుకోవాలనే విషయమై కౌంటింగ్ సూపర్‌వైజర్స్, అసిస్టెంట్లకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. డమ్మీ బ్యాలెట్ పేపర్లు, కవర్ల సహాయంతో కౌంటింగ్ ఎలా చేయాలనే విషయమై డెమో ఇచ్చారు. ఈ సందర్భంగా మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల ఆర్వోలు హరిప్రసాద్, రాఘవేంద్రలు మాట్లాడుతూ...మదనపల్లె నియోజకవర్గంలో 3,409, తంబళ్లపల్లె నియోజకవర్గంలో 1,933 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకున్నారన్నారు. ఈటీపీబీఎస్ విధానంలో మదనపల్లె నియోజకవర్గంలో 178 సర్వీస్‌ఓట్లకు 64మంది, తంబళ్లపల్లెలో 176 మందికి 53 మంది సర్వీస్‌ఓటర్లు తమ బ్యాలెట్‌ను అందజేశారన్నారు. మిగిలిన వారు జూన్ 4వ తేదీ ఉదయం 7గంటలవరకు తమ బ్యాలెట్‌ను రాయచోటిలోని శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో అందజేసే అవకాశం ఉందన్నారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు ఈటీపీబీఎస్, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లతో పాటుగా పోస్టల్‌బ్యాలెట్, ఈటీపీబీఎస్ ఓట్ల లెక్కింపుకు అదనంగా టేబుళ్లను ఏర్పాటుచేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఆర్వోలు రమాదేవి, కమిషనర్ కే.ప్రమీల, డీఎల్‌డీఓ లక్ష్మీపతి, ఎంపీడీఓ భానుప్రసాద్, ఆర్ఐ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

స్పెషల్ డీఎస్పీ మోహన్ రావు



మాట్లాడుతున్న స్పెషల్ డీఎస్పీ మోహన్‌రావు

వాల్మీకిపురం : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ నాల్గవ తేది కౌంటింగ్ వరకు ప్రజలంతా సహకరించాలని, ఘర్షణలకు పాల్పడి, నిబంధనలు పాటించనివారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పెషల్ డీఎస్పీ మోహన్‌రావు అన్నారు. గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఇరుపార్టీల రాజకీయ నాయకులతో వేరువేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఓట్లు లెక్కింపు జరిగే రోజు ప్రజలంతా గుంపులు గుంపులుగా గుమ్మికూడరాదన్నారు. కౌంటింగ్ రోజున 144 సెక్షన్‌తో పాటు సెక్షన్ 31 పోలీస్ యాక్ట్ కూడా అమలులో ఉంటుందని, ప్రతి ఒక్కరూ తప్పకుండా నిబంధనలు పాటించాలన్నారు. కౌంటింగ్ తర్వాత రోజులల్లో కూడా ర్యాలీలు, బాణాసంచా పేలుళ్లు నిషేదమన్నారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ పులిశేఖర్, ఎస్సైలు నాగేశ్వర రావు, క్రిష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 1.80 లక్షల వెండి సామగ్రి వితరణ



టీటీడీ ఏఈవోకు వెండి సామగ్రిని అందిస్తున్న ఆనందరెడ్డి కుటుంబ సభ్యులు

వాల్మీకిపురం : స్థానిక శ్రీ పట్టాభిరామాలయానికి రూ.1.80 లక్షలు విలువ చేసే వెండి సామగ్రిని వితరణగా అందించినట్లు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సాగుబడి ఆనందరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పట్టాభిరామాలయంలో టీటీడీ ఏఈవో గోపినాథ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ తన కుమారుడు సాగుబడి వెంకట కుమార్ రెడ్డి స్థానిక రామాలయానికి వెండి తట్ట, ఐదు వెండి గిన్నెలు, రెండు ఉద్దరణీలు అందజేసినట్లు తెలిపారు. అనంతరం సాగుబడి ఆనంద రెడ్డి కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో అనూష, కుషల్‌సాయి రెడ్డి, పవిశ్న, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలలో ఉన్నత స్థాయికి ఎదగాలి



క్రీడాకారులను అభినందిస్తున్న స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా డిప్యూటీ డెరెక్టర్ హిమబిందు

గుర్రంకొండ : క్రీడలలో విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్ హిమబిందు ఐఏస్ అన్నారు. మండల కేంద్రమైన గుర్రంకొండలో తెలుగు జెడ్పీహైస్కూల్ ఖేలో ఇండియా ఫెన్సింగ్ (కత్తిసాము) కేంద్రంగా ఎంపికైంది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో ఈ కేంద్రం నిర్వహించబడుతోంది. ఈనేపథ్యంలో గురువారం ఆమె ఈ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలో కత్తిసాము శిక్షణ కార్యక్రమాలనుక పరిశీలించారు. క్రీడాకారులకు పలుసూచనలిచ్చారు. పాఠశాల విద్యార్థులు గతంలో వారి ప్రతిభను ప్రదర్శించి ఫెన్సింగ్‌లో సాధించిన సర్టిఫికెట్లను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా చీఫ్ కోచ్ మహమ్మద్ గౌస్, జిల్లా ఫెన్సింగ్ కోచ్ రవీంద్ర, పీడీ రమేష్‌బాబులు పాల్గొన్నారు.

బీసీజీతో టీబీ నివారణ సాధ్యం

తంబళ్లపల్లె: బీసీజీ వ్యాక్సిన్ తో టీబీ (క్షయ)వ్యాధి నివారణ సాధ్యమని కోసువారిపల్లె పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ అనుపమ డాక్టర్ మునికుమార్‌లు తెలిపారు. గురువారం మండలంలో అన్ని విలేజ్‌క్లీనిక్ల పరిధిలో బీసీజీ వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. 383 మందికి వ్యాక్సిన్ టీకాలు వేసినట్లు వైద్యులు తెలిపారు.

కలకడ : దేశంలోనే బీసీజీతో క్షయవ్యాధి లేకుండా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం వయోజనులకు వ్యాక్సిన్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు ఎర్రకోటపల్లె పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కదిరాయచెర్వు సచివాలయం పరిధిలోని బొంతలవారిపల్లె, దిగువ పాళ్యెం గ్రామాలలో పర్యటించి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ షెడ్యూలులో మార్పులు

మదనపల్లె సిటీ : ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పాలిసెట్-24 కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మార్పులు చేసినట్లు స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ ఓబులేసు, పాలిసెట్-24 అసిస్టెంట్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పాలిసెట్ కౌన్సెలింగ్‌లో మార్పులు చేసినట్లు తెలిపారు. జూన్ 3న సర్టిఫికెట్లు పరిశీలన 6వ తేదీకి మార్పు చేసినట్లు పేర్కొన్నారు. 7వ తేదీ నుంచి 10వతేదీ వరకు ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించారన్నారు. జూన్ 11న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉందన్నారు. తుది సీట్లు కేటాయింపు జూన్ 13న జరుగుతుందన్నారు. 14న కాలేజీ తరగతులు ప్రారంభవుతాయని, 19లోగా సీట్లు కేటాయించిన విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలని తెలిపారు. విద్యార్థులు ఈ మార్పును గమనించాలని కోరారు.

జిల్లా జూనియర్ బాలుర ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

మదనపల్లె సిటీ : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా బాలుర ఫుట్‌బాల్ జట్టు ఎంపిక జరిగింది. ఈ ఎంపికకు జిల్లా నలుమూలల నుంచి 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో తుది జట్టుకు 22 మంది ఎంపికయ్యారు. వీరికి శుక్రవారాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్యాంపు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ సభ్యులు దిలీప్, మురళీధర్, మహేంద్ర తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రీవాల్యుయేషన్‌తో పెరిగిన మార్కులు



మధులతారెడ్డి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని అంకిరెడ్డిపల్లి పంచాయతీ తోకలవారిపల్లికి చెందిన గోపిదాని గంగిరెడ్డి కుమార్తె జీ.మధులతా రెడ్డి మండల కేంద్రంలోని తెలుగు జెడ్పీ హైస్కూల్లో పదవ తరగతి చదివింది. గత నెలలో పబ్లిక్ పరీక్షలు రాయగా సదరు బాలికకు 528 మార్కులు వచ్చాయి. అయితే గణితంలో 77 మార్కులు మాత్రమే రావడంతో ఉపాధ్యాయుల సూచనల మేరకు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకుంది. ఈ నేపథ్యంలో మంగళవారం విడుదలైన ఫలితాల్లో సదరు బాలికకు గణితంలో అదనంగా 19 మార్కులు వచ్చాయి. గణితంలో వందకు 96 మార్కులు వచ్చాయని బాలిక తండ్రి తెలిపారు.

కొత్తపల్లె వివాదంపై రెండు కేసులు

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ కొత్తపల్లెలో రోడ్డు వివాదానికి సంబంధించి రెండు కేసులు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రవీంద్రనాయక్ గురువారం తెలిపారు. కొత్తపల్లెకు చెందిన నిర్మల తన ఇంటి ముందు తనకు చెందిన స్థలంలో సిమెంటు పలకలతో ప్రహరీ నిర్మించుకోగా మంగళవారం రాత్రి ఏనుగుమల్లమ్మ ఉత్సవ ఊరేగింపునకు అడ్డమని ఇదే గ్రామానికి చెందిన మురళీ మరో 8 మంది ప్రహరీని ధ్వంసం చేశారు. అడ్డుకోబోయిన తనపట్ల అసభ్యంగా ప్రవర్తించారని ఫిర్యాదు చేసింది. దీనిపై 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే కొత్తపల్లెకు చెందిన నిర్మల రోడ్డుపై ప్రహరీ నిర్మించడంపై గ్రామానికి చెందిన రమణమ్మ ప్రశ్నించింది. దీనిపై నిర్మల, ఆమె మరిది మురళీ, కుటుంబీకులు దాడిచేసి కొట్టడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఈ ఘటనపై రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ రెండు కేసులను విచారిస్తున్నట్లు రవీంద్రనాయక్ తెలిపారు.

మండలాభివృద్ధికి సమష్టి కృషి అవసరం



మాట్లాడుతున్న ఎంపీడీఓ యాదవేంద్ర

కేవీపల్లె : మండలాభివృద్ధికి సమష్టి కృషి అవసరమని ఎంపీడీఓ యాదవేంద్ర అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈశ్వరమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం అభివృద్ధి చెందే విధంగా స్థానిక ప్రజాప్రతినిధులు, మండలంలోని అన్ని శాఖల ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలని కోరారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మౌలిక వసతుల కల్పనకు,తాగునీటి సౌకర్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం మండలంలోని ప్రగతిని శాఖల వారిగా చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ హరిబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫలితాలు వెలువడినా సంబరాలు వద్దు

- ఎన్నికల కేసులో ఉంటే బెయిల్‌కూడా రాదు
- 6వ తేదీ వరకూ 144 సెక్షన్ అమలు
- డీఎస్పీ మోహనరావ్



మాట్లాడుతున్న డీఎస్పీ మోహనరావ్

కలకడ : జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడినా సంబరాలు వద్దని, అందుకు ఎన్నికల కమిషన్ అనుమతి ఇవ్వలేదని రాయచోటి డీఎస్పీ మోహనరావ్ అన్నారు. గురువారం సాయంత్రం కలకడ సర్కిల్ కార్యాలయం ఆవరణంలో మండలంలోని అన్ని పార్టీల ముఖ్యనాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వివిధ పార్టీల అభిమానులు, కార్యకర్తలు, నాయకులు సమ్యవనం పాటించి ఇంటికే పరిమితం కావాలని కోరారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో ఘర్షణలు, మాటలు ఎక్కువ అయినా కనీసం కేసు నమోదు అయితే బెయిల్‌కూడా మంజూరు కాదని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రదేశాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని 6వ తేదీ వరకూ ఎలాంటి ఘర్షణ వాతావరణం ఉన్నా ముందస్తు అదుపులు తప్పవని హెచ్చరించారు. 3, 4, 5 తేదీల వరకూ బ్రాంది షాపులు కూడా లేవని, టపాసులు పేల్చడం, కేరింతలు వేయడం చేస్తే పోలీసుల ఆదేశాలు బేఖాతరు చేసినట్లు భావించి చుట్టుపక్కల ఉన్న అందరి మీద సుమోటో కేసు నమోదు చేస్తామన్నారు. దేశంలోనే అత్యధికంగా 82 శాతం పోలింగ్ ఒక్క ఆంధ్రప్రదేశ్ మాత్రం జరిగినట్లు తెలిపారు. కౌటింగ్ వద్ద 21 కంపెనీల కేంద్ర బలగాలు బందోబస్తు విధుల్లో ఉంటారని, అత్యవసర సమయంలో తప్ప కుటుంబ సభ్యులు బయటకు రాకూడదని సూచించారు. అనంతరం కలకడ సర్కిల్ కార్యాలయం తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌నాయుడు, సింగల్‌విండో అధ్యక్షుడు వెంకట్రమణరెడ్డి, సర్పంచ్‌లు జల్లా రాజగోపాల్‌రెడ్డి, రామచంద్ర, మండల కోఆప్షన్ సభ్యులు ఇనాయతుల్లా, మోహన్‌రాజ, ప్రకాష్‌రెడ్డి, ఆర్‌వి, కుమార్‌రెడ్డి, బాబురెడ్డి, నరసింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గుర్రప్ప, విశ్వనాథ్, కోటరమణ, తదితరులు పాల్గొన్నారు.

యువత భవితకు మార్గదర్శకం ‘మై భారత్’



మాట్లాడుతున్న రామనాథన్

కురబలకోట : యువత భవితకు మార్గదర్శకంగా మై భారత్ నిలుస్తోందని అంగళ్లులోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామనాథన్ అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నేతృత్వంలో మై భారత్ పోర్టల్, డిజిటల్ లిటరసీపై రాష్ట్రంలోని వివిధ కళాశాలల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు గురువారం నుండి రెండు రోజుల శిక్షణ కార్యక్రమం కళాశాలలో ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ యువతకు మై భారత్ పోర్టల్ వరమన్నారు. ప్రతి యువత ఇందులో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఇప్పటికే 1.45 కోట్ల మందికిపైగా యువత ఇందులో రిజిస్టర్ చేసుకున్నారన్నారు. వివిధ విభిన్న రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రోత్సాహం లభిస్తుందన్నారు. పోర్టల్‌లో చేరిన వారి భవిష్యత్తుకు బాటలు వేస్తుందన్నారు. వివిధ అంశాలపై తర్ఫీదు ఇస్తారన్నారు. అదే సందర్భంలో డిజిటల్ అక్షరాస్యతపై సాంకేతికత, నైపుణ్యంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఇప్పుడు టెక్నాలజీ కాలం కావడంతో జీవితంలో రాణించాలంటే డిజిటల్ లిట్రసీ అవసరమన్నారు. విద్యార్థులు, ఉద్యోగలకు ఇది తప్పనిసరియన్నారు.

బుద్ధునికొండలో ధమ్మ పరివర్తన మహోత్సవం

మదనపల్లె : మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీలోని బుద్ధునికొండపై తథాగతుడు గౌతమబుద్ధుని 2568వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు మదనపల్లె బుద్ధవిహార ఫౌండర్ పీటీఎం.శివప్రసాద్, సభ్యులు పోతబోలురెడ్డెప్ప, చాట్లబయన్న, నీరుగట్టిరమణలు తెలిపారు. గురువారం బుద్ధునికొండపై ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ...బుద్ధునికొండ ఉత్సవాల పేరుతో జరిగే ధమ్మ పరివర్తన మహోత్సవాలకు ఏపీ, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి పలువురు బుద్దిస్ట్, అంబేద్కరిస్ట్ ప్రముఖులు హాజరవుతున్నారన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఉత్సవాలు జరుగుతాయని, బెంగళూరులోని మహాబోధి సొసైటీకి చెందిన బౌద్ధ బిక్షువులు హాజరై బుద్ధపూజ, ధమ్మ ప్రవచనం చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో సొన్నికంటిరెడ్డెప్ప, ముత్యాలమోహన్, సూర్యరాయల్, తలారికృష్ణ, బురుజుచంద్ర, చాట్లకల్యాణ్, బైనేనిసురేష్, నీరుగట్టి రాజేష్, సొన్నికంటినితిన్, బురుజుజనార్ధన్, చెంబకూరుగణేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనకాయలను సద్వినియోగం చేసుకోండి



గుర్రంకొండ : తరిగొండలో వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్



పెద్దతిప్పముద్రంలో పచ్చిరొట్ట బ్యాగులను అందజేస్తున్న ఏడీఏ దీక్షాకుమారి

గుర్రంకొండ : రైతులు సబ్సిడీ వేరుశన విత్తనకాయలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ సూచించారు. గురువారం మండలంలోని తరిగొండ ఆర్బీకేలో వేరుశనగ విత్తనకాయల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విత్తనకాయల నాణ్యతపై రైతులను అడిగి తెలుసుకొన్నారు. ఆర్బీకేలో విత్తనకాయల స్టాకు, పంపిణీ చేసిన స్టాకు వివరాలను తనిఖీ చేశారు. జిల్లాలో ఎవరైనా రైతులు విత్తనకాయలు నాణ్యతలేవని ఫిర్యాదు చేస్తే ఆర్బీకే సిబ్బంది వెనక్కు తీసుకోవాలన్నారు. ఆర్బీకే సిబ్బంది ముందుగా ఆర్బీకేల్లోనే విత్తనాల నాణ్యత పరిశీలించాలన్నారు. ఎవరైనా సిబ్బంది ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఆర్బీకేల్లో విత్తనకాయలు తీసుకొన్న రైతులు తప్పనిసరిగా పంట సాగు చేయాలన్నారు. అలాగే పంటసాగుకు సంబంధించి ఈ-నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విత్తనాధికారి రమేష్‌రాజు, ఇన్‌చార్జ్ ఏఓ నవీన్‌కుమార్‌రెడ్డి, వీఏఏ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన పంపిణీ తనిఖీ

పెద్దతిప్పసముద్రం : వ్యవసాయ శాఖ ఏడీఏ దీక్షాకుమారి గురువారం ప్రభుత్వం ద్వారా రాయితీపై రైతులకు ఆర్‌బీకేల్లో అందిస్తున్న వేరుశనగ విత్తన కాయల పంపిణీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో భాగంగా మదనపల్లి డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల్లో 25,294 క్వింటాళ్ళ విత్తన కాయలు పంపిణీ చేస్తున్నామన్నారు. అదనంగా మరో మూడు వేల క్వింటాళ్ళ కాయల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు.

విత్తనకాయలను సద్వినియోగం చేసుకోవాలి

తంబళ్లపల్లె : మండలంలో ఖరీఫ్ సాగుకు రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న వేరుశనగ విత్తనకాయలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ సూచించారు. గురువారం కుక్కరాజుపల్లె ఆర్‌బీకే సెంటర్‌లో విత్తనకాయల పంపిణీ ప్రారంభించారు. రైతులకు సకాలంలో సమస్య లేకుండా పంపిణీ చేయాలని ఏఓ రమణకుమార్ అగ్రికల్చర్ అసిస్టెంట్లను ఆదేశించారు. 12 ఆర్‌బీకేల్లో 1000 క్వింటాళ్ల విత్తనకాయలను మొదటిరోజు పంపిణీ చేశామన్నారు.

ఘనంగా అమ్మవారి నిమజ్జనోత్సవం

మదనపల్లె సిటీ: స్థానిక కోర్టు ఆవరణంలో వెలసిన కోర్టు గంగమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారిని ఘనంగా నిమజ్జనోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద నుంచి ప్రత్యేక ట్రాక్టర్‌లో అమ్మవారి విగ్రహంను పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి భక్తులు కర్పూరహారతులు, టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవాయిద్యాలు, మేళతాళాలతో ఊరేగింపుగా అమ్మవారిని నిమజ్జనం చేశారు. దీంతో జాతర ఉత్సవాలు ముగిశాయి.

జాతర విజయవంతం

కోర్టులో గంగమ్మ జాతర విజయవంతమైనట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ మార్పురి చిన్నరెడ్డప్ప, ఉపాధ్యక్షులు వేణుగోపాల్,మార్పురి బాబునాయుడు, మహేష్, రంగస్వామినాయుడు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జాతర జరిగిందన్నారు.